31వ గ్లోబల్ పీస్ అండ్ ఎక్సలెన్సీ అవార్డులు

లిబర్టీ: వివిధ రంగాల్లో నిష్ణాతులైన వారికి గ్లోబల్ పీస్ అండ్ ఎక్సలెన్సీ అవార్డులను ప్రదానం చేయనున్నట్లు ఆదిలీలా ఫౌండేషన్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ ఎస్.ఆదినారాయణ వెల్లడించారు. వివిధ రంగాల్లో అత్యంత ప్రతిభా పాటవాలు కనబరుస్తున్న వారికి అవార్డులు ప్రదానం చేస్తామని పేర్కొన్నారు. ఫౌండేషన్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎక్సలెన్స్ అవార్డు – 2015 పేరిట ఈ నెల 31వ తేదీన 6.30 గంటలకు గోవా విలేజ్ రిసార్ట్స్‌లో అవార్డుల ప్రదాన ఉత్సవం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

ప్రభుత్వానికి డెడికేషన్ కమిషన్ నివేదిక ఇవ్వాలి

లిబర్టీ: తెలంగాణ ప్రభుత్వానికి డెడికేషన్ కమిషన్ నివేదికను వెంటనే సమర్పించాలని బీసీ దళ్ జాతీయ అధ్యక్షులు దుండ్ర కుమారస్వామి కోరారు. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించాలంటే కమిషన్ ఇచ్చే నివేదికని పరిగణలోకి తీసుకుంటారని ఆయన తెలిపారు. గురువారం దళ్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైకోర్టు ఆదేశాల మేరకు తెలంగాణ ప్రభుత్వం స్థానిక సంస్థలను రిజర్వేషన్లు కల్పించేందుకు లెక్కలు తేల్చాలని డెడికేషన్ కమిషన్ నియమించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. కమిషన్ నివేదికనిస్తేనే స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని కుమారస్వామి పేర్కొన్నారు. డెడికేషన్ కమిషన్ సమగ్ర వివరాలను సేకరించి వెనువెంటనే ప్రభుత్వానికి అందజేయాలని ఆయన విన్నవించారు. స్థానిక సంస్థల పదవీకాలం ముగిసి ఏడాది గడుస్తుందని స్థానిక సంస్థల్లో సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు లేకపోవడం వల్ల అభివృద్ధి కుంటుపడుతుందని ఆయన అన్నారు.

ప్రజల సహకారంతోనే పండుగలు ప్రశాంతం

ముషీరాబాద్: ప్రజల సహకారంతోనే సంక్రాంతి పండుగ సంబరాలు ప్రశాంతంగా ముగిశాయని ముషీరాబాద్ సీఐ రాంబాబుయాదవ్ అన్నారు. గురువారం భోలక్‌పూర్‌కు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు అక్లక్ హుస్సేన్ ఆధ్వర్యంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు స్టేషన్‌లో పోలీసులను కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. స్టేషన్ పరిధిలో ఇరువర్గాల ప్రజలు కలిసిమెలిసి పండుగలను జరుపుకుంటూ మతసామరస్యాన్ని కాపాడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు ప్రశాంత్‌రెడ్డి, రాజ్‌కుమార్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

బస్తీ రోడ్లకు ప్యాచ్‌వర్క్స్



కాచిగూడ: వీరన్నగుట్ట బస్తీలో రోడ్డు మొత్తం గుంతలమయంగా మారింది. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ సమస్యను బస్తీ ప్రజలు కాచిగూడ కార్పొరేటర్ ఉమారాణి దృష్టికి తీసుకెళ్లారు. కార్పొరేటర్ స్పందించి సమస్యను జీహెచ్ఎంసీ అధికారులతో మాట్లాడి గురువారం రోడ్లకు ప్యాచ్‌వర్క్ చేయించారు. అనంతరం బస్తీలో ఆమె పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తమ దృష్టికి తీసుకొస్తే వీలైనంత త్వరగా పరిష్కరించే విధంగా కృషి చేస్తానని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు రమేష్‌యాదవ్, ఎస్ఎస్ రాము, చంద్రయ్య, బాబు, భీమ్‌రాజ్, రామకృష్ణ, రవియాదవ్, రామన్ తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక



సామవేదం షణ్ముఖశర్మను కలిసిన గీతామూర్తి

కాచిగూడ: మన సంస్కృతీ సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రముఖ ప్రవచనకర్త బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ అన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా బీజేపీ సంస్థాగత రాష్ట్ర ఎన్నికల కోరిటర్నింగ్ అధికారిణి కె.గీతామూర్తి గురువారం బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మను మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో కె.మూర్తి, సౌరబ్, రోషిణి తదితరులు పాల్గొన్నారు.

నియామకం



గూడ జయరామ్

నల్లకుంట: తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి (టీబీఎస్ఎస్) రంగారెడ్డి జిల్లా ప్రచార కార్యదర్శిగా గూడ జయరాం నియమితులయ్యారు. ఈ మేరకు టీబీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు ఆయనకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జయరామ్ మాట్లాడుతూ.. బ్రాహ్మణ ఐక్యత కోసం తన కృషి చేస్తానని చెప్పారు.

వేర్ ఈజ్ ద ఫుట్‌పాత్





పాదచారి.. లేదు దారి.!

చిరు వ్యాపారులకు అడ్డాలుగా మారుతున్న ఫుట్‌పాత్‌లు

- పట్టించుకోని ట్రాఫిక్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు
- యథేచ్ఛగా ఆక్రమణలకు గురవుతున్న ఫుట్‌పాత్‌లు
- రోడ్లపై నుంచే నడుచుకుంటూ వెళ్తున్న పాదచారులు



ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద ఫుట్‌పాత్‌ను ఆక్రమించి వ్యాపారులు

కవాడిగూడ: కాలిబాటలు, చౌరస్తాల ఆక్రమణలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఓ వైపు ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతుంటే మరోవైపు రహదారుల కబ్జా ఆందోళన కలిగిస్తుంది. హద్దు అదుపు లేకుండా టిఫిన్ సెంటర్లు, టీకొట్లు, పాన్ డబ్బాలు, మధ్యాహ్న భోజన హోటళ్లు రోడ్ల పొడవునా పుట్టుకొస్తున్నాయి. వాటి వద్ద ద్విచక్రవాహనాలు, కార్లు, ఆటోలు నిలుస్తుండటంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుంది. ఇంత జరుగుతున్నా జీహెచ్ఎంసీ, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాన్ని, పట్టణ ప్రణాళిక విభాగాల అధికారులు ఆక్రమణలు తొలగించినా మళ్లీ సమస్య తలెత్తింది. ఆయా విభాగాల అధికారులు మొక్కుబడి చర్యలే ఇందుకు కారణమని స్థానికులు వాపోతున్నారు.

ఎక్కడెక్కడ అంటే...

◆ బండమైసమ్మ కమ్యూనిటీహాల్ నుంచి ఇందిరా పార్కు చౌరస్తా వరకు ధర్నాచౌక్‌కు ఇరువైపుల మధ్యాహ్న భోజన హోటళ్లు, పాన్ డబ్బాలు, టిఫిన్ సెంటర్లు, కూరగాయాల దుకాణాలతో ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతోంది. మరోవైపు గగన్ మహల్‌లోని జానీకేఫ్ నుంచి సాదూరాం ఐ హాస్పిటల్ నుంచి ఏవీ కాలేజ్, దోమలగూడ హెల్త్ సెంటర్ వరకు రోడ్ల ఆక్రమణలతో తీవ్ర ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది.

◆ దోమలగూడ హెల్త్ సెంటర్ ముందు ఓ టిఫిన్ సెంటర్ నిర్వాహకుడు సగానికిపైగా రోడ్డును ఆక్రమించడంతో హెల్త్ సెంటర్‌కు వచ్చే పేషెంట్లు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయంపై ట్రాఫిక్, పట్టణ ప్రణాళిక విభాగం అధికారులకు అనేక సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.

◆ గత కొన్నేళ్లుగా కొంత మంది కబ్జాదారులు ఫుట్‌పాత్‌లు ఆక్రమించి వాటిపై పర్మనెంట్ నిర్మాణాలను చేపట్టి ఆ స్థలాలను అద్దెకు ఇచ్చి సొమ్ము చేసుకుంటున్నారు. పెరిగిన వాహనాల రద్దీ కారణంగా నిత్యం ట్రాపిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

అధికారులు చర్యలు తీసుకోవాలి



కవాడిగూడ డివిజన్‌తో పాటు ముషీరాబాద్ సర్కిల్‌లో యథేచ్ఛగా రోజురోజుకు ఫుట్‌పాత్ ఆక్రమణలు పెరిగిపోతున్నాయి. దీనితో ట్రాఫిక్‌సమస్యలు తలెత్తి వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు.

– వెంకటేష్, బీజేపీ నేత

ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నాం

ఆక్రమణలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నాం. ఫుట్‌పాత్‌లు ఆక్రమించి వ్యాపారాలు చేస్తూ ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగించే వారిపై కేసులు నమోదు చేస్తున్నాం. త్వరలో పూర్తిస్థాయిలో ఆక్రమణలు తొలగించి పాదచారులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం.

– వీరేశం, ట్రాఫిక్ సీఐ


ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలి



ఎక్కడ చూసినా ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు పెరిగిపోయాయి. దీంతో ట్రాఫిక్ సమస్య తలెత్తడంతో స్థానికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు కంటితుడుపు చర్యలు కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలి.

– సంగపాక వెంకట్, కాంగ్రెస్ నేత

వేర్ ఈజ్ ద ఓల్డ్ లుక్





ముగిసిన మల్లన్నస్వామి బ్రహ్మోత్సవాలు



మల్లన్నస్వామికి బోనాలు తీసుకొస్తున్న ఆలయ కమిటీ మాజీ చైర్మన్ ఊర్మిళ కుటుంబ సభ్యులు

ముషీరాబాద్: భోలక్‌పూర్ బాకారంలో ప్రసిద్ధిగాంచిన భ్రమరాంబ మల్లికార్జునస్వామి(మల్లన్న) బ్రహ్మోత్సవాలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయ కమిటీ మేనేజింగ్ ట్రస్టీ నల్లవెల్లి అంజిరెడ్డి ఆధ్వర్యంలో నాలుగు రోజుల పాటు అంగరంగ వైభవంగా జరిగాయి. అశోక్‌నగర్‌కు చెందిన స్వామివారి భక్తుడు ఆర్.రాజనర్సింగ్‌రావు, ఉమామహేశ్వరి దంపతుల సహకారంతో అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. అంతకు ముందు ఊరేగింపుగా బోనాలు తీసుకువచ్చి మల్లన్నస్వామికి నైవేద్యంగా సమర్పించారు. రాత్రి నిర్వహించిన అగ్ని గుండంలో నడిచే కార్యక్రమాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో సందడి వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ మాజీ చైర్మన్ ఊర్మిళ, నాయకులు మల్లికార్జున్‌రెడ్డి, హారిక, యాదగిరి, సురేష్, రామానందరెడ్డి, రాజు, సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన వారికే రేషన్‌కార్డులు అందజేస్తాం

ముషీరాబాద్ తహసీల్దార్ రాణాప్రతాప్‌సింగ్



తాళ్లబస్తీలో సర్వే నిర్వహిస్తున్న రెవెన్యూ, సివిల్ సప్లై అధికారులు

కవాడిగూడ: ప్రజాపాలనలో ఆరు గ్యారంటీలకు దరఖాస్తు చేసుకున్న వారికే రేషన్‌కార్డులు అందించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ముషీరాబాద్ తహసీల్దార్ రాణాప్రతాప్ సింగ్ తెలిపారు. గురువారం కవాడిగూడ డివిజన్‌లోని పలు ప్రాంతాలలో రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులైన లబ్ధిదారులను గుర్తించేందుకు పౌరసరఫరాల శాఖ, రెవెన్యూ అధికారులు తాళ్లబస్తీలో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాపాలనలో రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నవారికి సివిల్ సప్లై అధికారులకు వచ్చిన లిస్టు ప్రకారం ఎంక్వైరీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ తహసీల్దార్ రాణాప్రతాప్‌సింగ్, రెవెన్యూఅధికారి పద్మ, సివిల్ సప్లై అధికారి కిరణ్మై, లబ్ధిదారులకు ఫోన్ చేసి ఇంటింటి ఎంక్వైరీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రాణాప్రతాప్‌సింగ్ మాట్లాడుతూ... ముషీరాబాద్ తహసీల్దార్ కార్యాలయం పరిధిలో రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న వారిని అడిగి వివరాలు తెలుసుకున్నామని అన్నారు. లిస్ట్‌లో పేరురాని వారు మరోసారి ఈ సేవా ప్రజాభవన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్ అశోక్‌రెడ్డి, రెవెన్యూ, సివిల్ సప్లై సిబ్బంది పాల్గొన్నారు.

రేపు డీడీసీవోపీ గ్రాడ్యుయేషన్ డే

నల్లకుంట: నల్లకుంటలోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ కాలేజీ ఆఫ్ ఫిజియోథెరపీ(డీడీసీవోపీ) గ్రాడ్యుయేషన్ డే ఈనెల 18న నిర్వహించేందుకు అని ఏర్పాట్లు చేశామని డీడీసీవోపీ ప్రిన్సిపాల్ ఛాయ నందిని గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యానగర్ దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ ఆస్పత్రి ఆవరణలో ఉన్న డీడీహెచ్ అండ్ రీసెర్చ్ సెంటర్ ఆడిటోరియంలో ఉదయం 11గంటలకు కార్యక్రమం ప్రాంభమవుతుందని చెప్పారు. పాట్నా హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై పట్టాలు అందజేసి ప్రసంగిస్తారని తెలిపారు. ఆతిథ్య అతిథిగా డీడీఎంఎస్ ప్రెసిడెంట్ ఉషాకంద హాజరవుతారన్నారు.

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించాలి

చిక్కడపల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వీరేశం



ఆర్టీసీ క్రాస్‌రోడ్డులో హెల్మెట్ ధరించిన వారికి గూలాబీ పువ్వు ఇస్తున్న ట్రాఫిక్ పోలీసులు

చిక్కడపల్లి: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని చిక్కడపల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వీరేశం అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసంలో భాగంగా అరోరా కళాశాల కాలేజీ విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లతో గురువారం ఆర్టీసీ క్రాస్‌రోడ్డులో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అటుగా వెళ్లే వాహనదారులకు హెల్మెట్ ధరించాలని కోరారు. ఈ సందర్భంగా హెల్మెట్ ధరించిన వాహనదారులకు గులాబీ పువ్వు ఇచ్చి అభినందించారు. అదే విధంగా ఫుట్‌పాత్‌లపై ఉన్న ఆక్రమణలను తొలగించడం, వీధి వ్యాపారులకు రోప్ ఆపరేషన్ ప్రాముఖ్యతను ఇన్‌స్పెక్టర్ వీరేశం వివరించారు. జీబ్రా క్రాసింగ్, సిగ్నల్స్ పాటించాలని కోరారు. వాహనాలు నడిపే సమయంలో సెల్‌ఫోన్‌లను ఉపయోగించొద్దన్నారు. కారు ప్రయాణించే వారు సీటు బెల్టులు తప్పనిసరిగా పెట్టుకోవాలని కోరారు. మద్యం సేవించి వాహనం నడపొద్దన్నారు. హెల్మెట్ల ప్రాముఖ్యతను వివరించే ప్లకార్డులు ప్రదర్శించి వాహనదారుల్లో అవగాహన కల్పించారు. పిలియన్ రైడర్లు సైతం హెల్మెట్ ధరించాలని కోరారు.

18న ఐఎఫ్‌టీయూల విలీన సభ

ముషీరాబాద్: బలమైన కార్మిక నిర్మాణం విస్తరణ కార్మిక వర్గ విశాల ప్రయోజనాల కోసం జనవరి 18వ తేదీన భద్రాది కొత్తగూడెంలో ఐఎఫ్‌టీయూల విలీన సభ నిర్వహిస్తున్న ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఎం.శ్రీనివాస్, ఆర్.జనార్దన్ తెలిపారు. ఈ మేరకు మార్క్స్ భవన్‌లో పోస్టర్‌ను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ భావ సారూప్యత కలిగిన విప్లవ కార్మిక సంఘాలైన రెండు ఐఎఫ్‌టీయూలు ఐక్యం కావాలన్న నిర్ణయానికి వచ్చి జనవరి 18న భద్రాది కొత్తగూడెం జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలో జి.అనురాధ, కృష్ణల అధ్యక్షతన ఐక్యత సభ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఐఎఫ్‌టీయూ అఖిల భారత అధ్యక్షురాలు డాక్టర్ అపర్ణ హాజరవుతారన్నారు. వివిధ అంశాలపై మాట్లాడడానికి ఐఎఫ్‌టీయూ జాతీయ నాయకులు బి.ప్రదీప్, సాదినేని వెంకటేశ్వరరావు, పి.ప్రసాద్, టి.శ్రీనివాస్ తదితరులు పాల్గొంటారని తెలిపారు.



మార్క్స్ భవన్‌లో వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

సీఎం కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి

బీఆర్ఎస్ గ్రేటర్ నేత ఎంఎన్ శ్రీనివాసరావు



ముషీరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి రాజకీయ కక్షసాధింపు చర్యలు మానుకొని పాలనపై దృష్టి సారించాలని గురువారం బీఆర్ఎస్ గ్రేటర్ నేత ఎంఎన్ శ్రీనివాస్‌రావు అన్నారు. అధికారంలోకి వచ్చి 13 నెలలు అవుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిస్థాయిలో మంత్రివర్గాన్ని ఏర్పాటు చేసుకునే పరిస్థితి లేదని విమర్శించారు. ప్రజా సమస్యలను గాలికొదిలేశారని అన్నారు. బీఆర్ఎస్‌కు ఉన్న పేరును చెరిపేయాలని సీఎం రేవంత్ రెడ్డి ప్రయత్నింస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ కేడర్‌ను భయభ్రాంతులకు గురిచేయాలని ప్రయత్నిస్తున్నారని అన్నారు. ప్రశ్నించే వారి అరెస్టులు చేస్తూ ప్రభుత్వం పబ్బం గడుపుకోవాలని చూస్తోందని ఆరోపించారు. దమ్ముంటే ఎన్నికల్లో ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని సవాలు విసిరారు.

ఓటరు జాబితాపై రాజకీయ పార్టీల నేతలతో సమావేశం



వివిధ రాజకీయ పార్టీల నేతలతో మాట్లాడుతున్న డీఎంసీ మారుతీదివాకర్

అంబర్‌పేట: ఓటరు జాబితా పకడ్బందీగా రూపొందించేందుకు సహకరించాల్సిందిగా వివిధ రాజకీయ పార్టీల నేతలను అంబర్‌పేట సర్కిల్ డీఎంసీ మారుతీదివాకర్ కోరారు. గురువారం ఆయన కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన పార్టీల నాయకులతో ఓటర్ జాబితాపై సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలోని పోలింగ్ బూత్‌ల వారీగా ఎలాంటి ఇబ్బందులు ఉన్న తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అర్హులైన కొత్త ఓటర్ల నమోదుకు సహకరించాలన్నారు. తొలగించాల్సిన ఓట్లపై నిర్దిష్టమైన సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ రవీందర్, డిప్యూటీ తహసీల్దార్ సునీత, నాయకులు అజయ్‌కుమార్, మహేందర్, మోసిన్, బాలరాజ్, శ్రీహరి పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి



రాంనగర్ డివిజన్ అధ్యక్షుడిగా నియమితులైన గడ్డం సతీష్‌ను అభినందిస్తున్న ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: బీజేపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ తమ వంతుగా కృషి చేయాలని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ పిలుపునిచ్చారు. రాంనగర్ డివిజన్ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన గడ్డం సతీష్‌ను గురువారం పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు. ఈ సందర్భంగా డాక్టర్ కె. లక్ష్మణ్ మాట్లాడుతూ... ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషిచేయాలని సూచించారు. రానున్న జీహెచ్ఎంసీ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవడానికి ప్రతి ఒక్క కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని కోరారు. పార్టీ కోసం పనిచేసిన వారికి గుర్తింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ కె. రవిచారి, గుండగొని భరత్ గౌడ్, పూసరాజు, రమేష్‌రాం, గడ్డం నవీన్, కలకోట అరుణ్, ఉపేందర్, కిరణ్, కేశవ్, జక్కా శ్రీను, మంగళ, బీరయ్య పాల్గొన్నారు.

ముషీరాబాద్‌లో బీజేపీకి పూర్వ వైభవం తీసుకురావాలి..

ముషీరాబాద్: ముషీరాబాద్ నియోజకవర్గంలో బీజేపీకి పూర్వ వైభవం తీసుకురావడానికి డివిజన్ల నూతన అధ్యక్షులు కృషి చేయాలని రాజ్యసభ సభ్యుడు ఎమ్మెల్యే డాక్టర్ కె.లక్ష్మణ్ పిలుపునిచ్చారు. అడిక్‌మెట్ డివిజన్ నూతన అధ్యక్షుడిగా నియమితులైన పాశం సాయికృష్ణయాదవ్ డాక్టర్ కె.లక్ష్మణ్‌ను క్యాంపు కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సూర్యనారాయణ శర్మ, రొయ్యూరు శేషసాయి, కౌండిన్య ప్రసాద్, ఎంసీ మోహన్, నరేష్, కిషోర్, సుబ్రహ్మణ్యం, వంశీ, గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీజేపీ విజయానికి కృషి చేయాలి

కవాడిగూడ: రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీజేపీ విజయానికి డివిజన్ కొత్త అధ్యక్షులు కృషి చేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్ సూచించారు. గురువారం నూతనంగా ఎన్నికైన కవాడిగూడ డివిజన్ అధ్యక్షుడు సలంద్రి దిలీప్ యాదవ్‌తో పాటు పలువురు బీజేపీ డివిజన్ల అధ్యక్షులు డాక్టర్ కె.లక్ష్మణ్‌ను కలిసారు. ఈ సందర్భంగా డాక్టర్ కె. లక్ష్మణ్ నూతన డివిజన్ అధ్యక్షులను శాలువాతో ఘనంగా సత్కరించి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేంద్రంలో మోదీ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ఇంటింటికీ తీసుకెళ్లాలన్నారు. పార్టీ కోసం కష్టపడిన వారికి మంచి గుర్తింపు ఉంటుందన్నారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ముషీరాబాద్ నియోజకవర్గంలోని ఆరు డివిజన్లలో గెలిపించి పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జి. రచనశ్రీ, మాజీ కార్పొరేటర్ టి.రవీందర్, బీజేపీ రాష్ట్ర నాయకులు జి.వెంకటేష్, రంగరాజుగౌడ్, పరిమళ్‌కుమార్, ఎం.రమేష్‌రాం, సురేష్‌ముదిరాజ్, ఆర్.పద్మ, నగర నాయకులు ఎంసీ మహేందర్‌బాబు, ప్రభాకర్ గంగపుత్ర, కేశవరాజు, శ్రీనివాస్ ముదిరాజ్, శివరాజ్, బోళ్ల రమేష్, లింగంగౌడ్, రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ కె.లక్ష్మణ్‌ను సన్మానిస్తున్న అడిక్‌మెట్ బీజేపీ అధ్యక్షుడు పాశం సాయికృష్ణయాదవ్



కవాడిగూడ డివిజన్ అధ్యక్షుడు దిలీప్‌యాదవ్‌ను సన్మానిస్తున్న డాక్టర్ కె. లక్ష్మణ్, కార్పొరేటర్ రచనశ్రీ